క్లుప్తంగా

జగనన్న మా దేవుడు



ఇంట్లో దేవుడి పటాల వద్ద జగనన్న స్టిక్కర్‌ను అతికించుకొంటున్న ఈదూరు రమణమ్మ

నవరత్నాల పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు దేవుడిగా భావిస్తున్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా గురువారం గృహసారథులు అందజేసిన స్టిక్కర్‌ను తోటపల్లిగూడూరు మండలం పాపిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఈదూరు రమణమ్మ, దద్దోలు రాజేశ్వరి తమ ఇళ్లలో దేవుడి పటాల వద్ద జగనన్న స్టిక్కర్లను అంటించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.
– తోటపల్లిగూడూరు

ఎమ్మెల్యే పరామర్శ



కోవూరు(విడవలూరు): విడవలూరు మండలంలో పలు కారణాలతో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం పరామర్శించారు. విడవలూరులోని కోటంరెడ్డి గోపాల్‌రెడ్డి అల్లుడు శ్రీనివాసులురెడ్డి మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే పులిగొండ్ల శ్రీనివాసశర్మ కుమారుడు నితీష్‌కుమార్ మృతిచెందండంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు లక్ష్మయ్య, సర్పంచ్ సురేంద్రరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



భోజనం ప్యాకెట్ అందజేస్తున్న దృశ్యం

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో రైల్వే ట్రాక్ పక్కనున్న వినాయక గిరిజనకాలనీలో పాకలు దగ్ధమైన గిరిజనులకు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఇక్కడ సుమారు 25 కుటుంబాల గిరిజనులు పాకలు వేసుకొని జీవిస్తుండగా, బాణసంచా కాల్చుతూ 6 పాకలు గురువారం దగ్ధమయ్యాయి. సీఐటీయూ మండలశాఖ వారు స్థానిక హరిజనవాడలో బియ్యం, దుస్తులు, పాత్రలు సేకరించి బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండలశాఖ కార్యదర్శి తలారి నరసింహం, సీపీఎం నాయకుడు విడవలూరు దేవానంద్, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకుడు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ జరిపించాలి

ముత్తుకూరు: ముత్తుకూరు పంచాయతీలో గతంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యుడైన ఎస్ షెహజాదిని కమిషన్ సలహాదారు అబ్దుల్ షఫీవుల్లా గురువారం హైదరాబాదులో కలిసి వినతిపత్రం అందజేశారు. షేక్ రిజ్వాన్‌కి చెందిన స్థానిక బేకరీ–కూల్‌డ్రింక్స్ దుకాణం కూల్చివేతపై కూడా విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించారని, విచారణకు సిఫార్సు చేస్తామని హామీ ఇచ్చారని షఫీవుల్లా తెలిపారు.

జొన్నవాడ ఆలయ సందర్శన



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయాన్ని కాంచీపురం పీఠం స్వామి శిష్యబృందం గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్ట సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి మే 3వ తేదీ వరకు జరిగే మహా కుంభాభిషేక వేడుకల్లో భాగంగా స్వామివారి శిష్యబృందం ఆలయ పరిస్థితిని పరిశీలించారని తెలిపారు. కార్యక్రమంలో ఈఓ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విశేష స్పందన

తోటపల్లిగూడూరు: 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని సచివాలయాల మండల కన్వీనర్ తలమంచి సురేంద్రబాబు అన్నారు. మండలంలోని నరుకూరు సచివాలయ పరిధిలో నిర్వహించిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ క్రమంలో ప్రజల అభిప్రాయాలను సేకరించిన బుక్‌లెట్లను స్థానిక నాయకులు ఆకుల మధు, సురేంద్రబాబుకు అందజేశారు. కార్యక్రమంలో పొట్లూరి సురేఖ, ఇనమాల శ్రీను, అమరేంద్ర, గృహసారథులు, నాయకులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: మహిళల ఆర్థికాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. విడవలూరులో గురువారం ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగాలన్న ఆలోచనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా వారికి కోట్లాది రూపాయలు అందజేశారని తెలిపారు. పొదుపు సంఘాల సభ్యులు తీసుకొన్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి అధిక మొత్తంలో రుణాలు పొంది ఆర్థికంగా బలపడాలన్నారు. విడవలూరు మండలంలో ఉన్న పొదుపు సంఘాల వీఓఏలకు ప్రత్యేకంగా ఎమ్మెల్యే సొంత నిధులతో చీరలు పంపిణీ చేశారు. వీఓఏల అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కోవూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు దాదాపు 63 వేల గడపలు పూర్తి చేసినట్లు తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా ఒక్క విడవలూరు సచివాలయం పరిధిలోనే వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు దాదాపు రూ.10 కోట్లు అందజేసినట్లు తెలిపారు.

బ్రహ్మకుమారీల ఆశీర్వాదం

విడవలూరులో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధ్యాన కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. బ్రహ్మకుమారీల అభ్యర్థన మేరకు ఈ ధ్యాన్య కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, అచ్యుత్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మయ్య, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, సురేంద్రరెడ్డి, తిరుపతి, బానురెడ్డి, సంపూర్ణమ్మ, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



మంత్రి కాకాణి సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ నాయకులు

పొదలకూరు: మండలంలోని పులికల్లు వెంకటాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు గురువారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వెంకటాపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు దివంగత కూరపాటి ముసలప నాయుడు మనవడు కొమ్మి శ్రీనివాసులు నాయుడు, కూరపాటి రంగయ్యనాయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పులికల్లు గ్రామ నాయకుడు వై.పెంచలరెడ్డి, వావింటపర్తి సర్పంచ్ నెట్టెం కృష్ణయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి పెయ్యదూడలే రేపటి పాడిపశువులు



ఉత్తమ లేగదూడలను ప్రదర్శించిన రైతుకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

• పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్

ఇందుకూరుపేట: నేటి పెయ్యదూడలే రేపటి పాడిపశువులుగా అభివృద్ధి చెందుతాయని పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ మహేశ్వరుడు అన్నారు. మండలంలోని కొమరికలో గురువారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను సందర్శించిన రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ మాట్లాడుతూ లేగ దూడలను సంరక్షించుకొని మేలుజాతి పశువులుగా అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బి.మహేశ్వరుడు మాట్లాడుతూ జాతీయ కృత్రిమ గర్భధారణ పథకం ద్వారా రైతులు మేలు జాతి పశువులను ఉత్పత్తి చేసుకోవాలన్నారు. తద్వారా ఆదాయాన్ని, జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే పశువైద్యం కోసం 1962 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా అంబులెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డీడీ టి.సోమయ్య మాట్లాడుతూ కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్య(ఆడ) దూడలు మాత్రమే పుట్టేందుకు అవకాశం ఉన్న వీర్యాన్ని సబ్సిడీతో అందిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఉత్తమ లేగ దూడలను ప్రదర్శించిన పాముల ప్రసాద్, షేక్ బాబుల్ సాహెబ్, చేవూరు చంద్రబోస్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ మురళీకృష్ణ, పశువైద్యాధికారులు నాగేంద్ర, సురేష్, సర్పంచ్ వసుంధర, ఎంపీటీసీ సభ్యుడు సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు విరివిగా రుణాలు



వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంక్ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎర్రంరెడ్డి స్వర్ణ

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలో ఉన్న వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంక్ ద్వారా రైతులకు విరివిగా రుణాలు ఇస్తున్నట్లు ఆ బ్యాంక్ నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎర్రంరెడ్డి స్వర్ణ తెలిపారు. గురువారం ఆ బ్యాంక్‌లో బాధ్యతలను స్వీకరించిన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వవ్వేరు బ్యాంకు రాష్ట్రస్థాయిలోనే మొదటిస్థానంలో ఉందని, ఈ బ్యాంక్‌కు మరింత పేరు ప్రతిష్టలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ బ్యాంక్‌కు దాదాపు 1000 మంది ఖాతాదారులు ఉన్నారని, వారందరికీ సకాలంలో రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో తిరిగి చెల్లించినట్లయితే బ్యాంకు అభివృద్ధికి సహకరించిన వారవుతారని తెలిపారు. తనకు చైర్మన్ పదవి రావడానికి సహకరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ, నాయకులు ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, మేనకూరు సీతారామిరెడ్డి, కోడూరు వెంకటసుబ్బారెడ్డి, మోర్ల మురళి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చర్ల సతీష్‌రెడ్డి, పుట్ట సుబ్రహ్మణ్యంనాయుడు, త్రిసభ్య కమిటీ సభ్యుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సూరాయపాళెం, చెన్నారెడ్డిపల్లిలో 'గడప గడపకు..'

పొదలకూరు: మండలంలోని సూరాయపాళెం, చెన్నారెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం జరిగిగే 'గడప డపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొంటారని సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి గురువారం తెలిపారు. తొలుత సూరాయపాళెం గిరిజనకాలనీలో, అనంతరం చెన్నారెడ్డిపల్లిలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

పది పరీక్షలకు 629 మంది హాజరు

ముత్తుకూరు: ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్, వీబీఆర్ హైస్కూల్, పిడతాపోలూరు రత్నం హైస్కూల్‌లోని పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో 631 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా గురువారం జరిగిన సైన్స్ పరీక్షకు 629 మంది మాత్రమే హాజరయ్యారు. ఇద్దరు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యంతోపాటు వేసవి తీవ్రతకు విద్యార్థులు అస్వస్థతకు గురైతే ప్రథమ చికిత్స అందించేందుకు వైద్య సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు. కాగా మండుటెండల తీవ్రతకు విద్యార్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

ప్రజల ముంగిటకే వైద్యసేవలు

మనుబోలు: ప్రభుత్వం ప్రజలకే ముంగిటకే వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుందని వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాజు అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా స్థానిక చంద్రమౌళినగర్ గిరిజనకాలనీలో గురువారం స్థానికులకు పీహెచ్‌సీ సిబ్బంది వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరుగా ప్రజల ముంగిటకే వెళ్లి వైద్యసేవలు అందించేలా ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఆయన వెంట హెల్త్ సూపర్‌వైజర్ హైమావతి, ఏఎన్ఎం సుభాషిణి, ఎంపీహెచ్ఎస్ రమ్య తదితరులు ఉన్నారు.

విశిష్ట సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న గంట నర్సింహులు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంట నర్సింహులుకు విశిష్ట సేవా పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు జరుగుతున్న అన్యాయంపై నిరంతరం పోరాటం చేయడం వల్లే తనకు ఈ పురస్కారం లభించిందని తెలిపారు. విజయవాడలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో ఈ నెల 12వ తేదీన ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గంట నర్సింహులును గురువారం పలువురు అభినందించారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

• సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్

వెంకటాచలం : చట్టాలపై గ్రామీణ ప్రాంత ప్రజలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసులునాయక్ సూచించారు. మండలంలోని తిక్కవరప్పాడు మిక్స్‌డ్ కాలనీలో గురువారం ఉదయం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎం.శ్రీనివాసులునాయక్ మాట్లాడుతూ సమాజంలో వ్యక్తుల మధ్య వచ్చే తగాదాలు కోర్టు ద్వారా పరిష్కరించుకోవడానికి అధిక కాలం పట్టడమే కాకుండా, శ్రమ ఖర్చులతో కూడిన పని అని తెలిపారు. దీంతో 1987వ సంవత్సరంలో ప్రభుత్వం న్యాయ సేవాధికార సంస్థ చట్టాన్ని రూపొందించి తద్వారా పేదలకు, మహిళలకు ఉచిత న్యాయ సేవలను అందిస్తోందని తెలియజేశారు. సమాజంలో వెనుకబడిన వర్గాల ప్రజలు, మహిళలు, తమకు జరిగే అన్యాయాలను న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకొచ్చి సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. ఈ సదస్సులో తహసీల్దార్ కృష్ణ, సీఐ గంగాధర్ రావు, సర్పంచ్ చిరంజీవి, పారా లీగల్ వలంటీర్ ఎస్.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మినుములో యాజమాన్య పద్ధతులు కీలకం

• డీడీఏ శివనారాయణ



యల్లాయపాళెంలో మినుము సాగును పరిశీలిస్తున్న డీడీఏ శివనారాయణ

కొడవలూరు : వీబీఎన్–8 రకం మినుము సాగులో యాజమాన్య పద్ధతులు కీలకమని జిల్లా వనరుల కేంద్రం(డీఆర్‌సీ) డీడీఏ శివనారాయణ సూచించారు. మండలంలోని యల్లాయపాళేనికి చెందిన కోటారెడ్డికి వ్యవసాయ శాఖ ద్వారా మినుము వీబీఎన్–8 రకం మినీ కిట్‌ను అందించగా, వీటిని డీడీఏ గురువారం పరిశీలించారు. పంటలో అక్కడక్కడా పురుగు లక్షణాలు, ఎదుగుదల తక్కువగా ఉండడాన్ని గుర్తించారు. వాటి నివారణకు అవసరమైన మందులను సూచించారు. ఈ సందర్భంగా డీడీఏ మాట్లాడుతూ కొత్తరకాల సాగులో యాజమాన్య పద్ధతులు ప్రధానమన్నారు. ప్రతిదశలోనూ వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ సాగు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని స్పష్టం చేశారు. అనంతరం గండవరంలో విష్ణు తేజారెడ్డి అనే రైతు సేంద్రియ ఎరువులతో సాగు చేస్తున్న నావార, మైసూరు మల్లిక వరి రకాలను డీడీఏ పరిశీలించారు. ఆయన వెంట కేవీకే శాస్త్రవేత్త విజయకుమార్, ఏఓ లక్ష్మి, వీఏఏలు మహేష్, కవిత ఉన్నారు.

ఆన్‌లైన్ ఆరోగ్య సర్వే భేష్



సర్వే వివరాలను తెలుసుకుంటున్న డీడీ శ్రీనివాసులురెడ్డి

కొడవలూరు: కొడవలూరు పీహెచ్‌సీ పరిధిలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ ఆరోగ్య సర్వే భేష్‌గా ఉందని గుంటూరు ఆర్డీఓ కార్యాలయ డీడీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గురువారం ఆయన స్థానిక పీహెచ్‌సీని సందర్శించి ఆన్‌లైన్ ఆరోగ్య సర్వే వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని సిబ్బంది స్పష్టంగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారన్నారు. ఈ సర్వే భవిష్యత్‌లో రోగులకు వైద్య సేవలందించడంలో కీలకంగా మారనుందని తెలిపారు. ఈ సర్వే ఆధారంగా ప్రతి ఒక్కరికీ ఆరోగ్య గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం పీహెచ్‌సీ పరిధిలో అమలవుతున్న వివిధ ప్రభుత్వ పథకాల వివరాలను తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట స్టాటిస్టికల్ ఆఫీసర్స్ సహానా, ప్రత్యూష, వైద్యాధికారులు ఎం.రామకృష్ణ, బాలచంద్రబాబు, వైద్యసిబ్బంది ఉన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిరంజన్‌బాబురెడ్డి

కోవూరు: వేసవిని దృష్టిలో ఉంచుకుని కోవూరు తాలూకా ప్రాంగణంలో నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల సౌకర్యార్థం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కె.శ్రీలత, ఎంఏఏబీ చైర్మన్ ఎస్.హరిప్రసాద్‌రెడ్డి , వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు ఎం.చిరంజీవి, వాణిజ్య విభాగం నాయకుడు పి.వెంకటరమణారెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు వేణుగోపాల్, విద్యార్థి విభాగం నాయకుడు సాయి, ఎస్సీ సెల్ నాయకుడు అంజనరావు తదిరులు పాల్గొన్నారు.

సజావుగా పది పరీక్షలు

• విద్యాశాఖ జేడీ రామలింగం



అధికారులతో మాట్లాడుతున్న జేడీ రామలింగం

మనుబోలు: రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు సజావుగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నామని విద్యాశాఖ జేడీ రామలింగం తెలిపారు. స్థానిక విద్యావనరుల కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్న పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులకు అభినందనలు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో నో మొబైల్ జోన్ అమలుతో మంచి ఫలితాలు కనిపించాయన్నారు. ఎన్ఎస్, పీఎస్ పరీక్షకు వేర్వేరుగా జవాబులు రాయడం వల్ల విద్యార్థులకు సులభతరంగా ఉంటుందన్నారు. ఏ పేపర్‌లో 35 మార్కులు వచ్చినా పాస్ అవుతారని తెలిపారు. ఈ ఏడాది జేవీకే కిట్లను త్వరితగతిన పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీఆర్పీలకు సూచించారు. ఆయన వెంట ఆర్జేడీ సుబ్బారావు, ఎంఈఓ శేషాద్రివాసు, సీఆర్పీలు ఉన్నారు.

నందివాహనంపై విహరించిన శివపార్వతులు



నందివాహనంపై ఊరేగుతున్న సంగమేశ్వరస్వామి, కామాక్షితాయి అమ్మవారు

మనుబోలు: స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి సంగమేశ్వరస్వామి – కామాక్షితాయి నందివాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. అర్చకుడు సాయిశర్మ ఉదయం సంగమేశ్వరస్వామి – కామాక్షితాయి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి నందివాహనంపై కొలువుదీర్చారు. స్వామి, అమ్మవార్లకు ట్రాక్టర్‌పై గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు స్వామి, అమ్మవార్లకు కొబ్బరికాయలు, పండ్లు, పూలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అందెన హరనాథ్‌రెడ్డి ఉభయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డీజే, మంగళ వాయిద్యాలు, తప్పెట్ల విన్యాసాలు భక్తులను అలరించాయి.

నాణ్యమైన కిట్లు అందజేస్తాం

• ఆర్జేడీ సుబ్బారావు



మాట్లాడుతున్న ఆర్జేడీ సుబ్బారావు

మనుబోలు: రానున్న విద్యా సంవత్సరం ప్రారంభంలోనే నాణ్యతతో కూడిన 'జగనన్న విద్యాదీవెన కిట్లు' అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్జేడీ సుబ్బారావు తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న 10వ తరగతి పరీక్షల నిర్వహణను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఎంఈఓ కార్యాలయంలో ఆర్జేడీ విలేకరులతో మాట్లాడారు. జగనన్న విద్యాదీవెన కిట్లలో నాణ్యత లోపిస్తే తిరిగి పంపుతామని వెండర్‌కు ఆదేశాలిచ్చామని, సంవత్సరం పొడవునా ఉండేలా నాణ్యత గల సామగ్రి అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మనుబోలు మండలంలో 6,300 మంది విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన కిట్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంఈఓ శేషాద్రివాసు ఉన్నారు.

నాణ్యమైన సామగ్రి పంపిణీ

వెంకటాచలం: జగనన్న విద్యాకానుక పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన సామగ్రిని పంపిణీ చేస్తున్నట్లు విద్యాశాఖ ఆర్జేడీ వి.సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో గురువారం ఎంఈఓతోపాటు క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లతో ఆయన సమావేశం నిర్వహించారు. జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్లపై చర్చించిన ఆయన విద్యాకానుక ద్వారా అందించే పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, యూనిఫాం, డిక్షనరీలు, బెల్టులు భద్రపరిచేందుకు అవసరమైన గదులను పరిశీలించారు. పాఠశాలలు పునఃప్రారంభం లోపు జగనన్న విద్యాకానుక కిట్లను ఆయా పాఠశాలలకు చేర్చాలని సూచించారు. సమావేశంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్ బాబు, ఎంఈఓ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీని మరింత అభివృద్ధి చేయాలి



నూతన పాలకవర్గాన్ని అభినందించిన చలపతిరావు

కొడవలూరు: తలమంచి సొసైటీని మరింత అభివృద్ధి చేయాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు సూచించారు. తలమంచి సొసైటీ అధ్యక్షుడిగా దేవనబోయిన శివకుమార్, సభ్యులుగా కొట్టే మల్లికార్జున, వేగూరు వెంకటసురేష్ గురువారం మండలంలోని ఆ సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చలపతిరావు మాట్లాడుతూ తలమంచి సొసైటీ ఇప్పటికే అభివృద్ధి పథంలో ఉందని, రైతులకు అండగా ఉంటూ మరింత అభివృద్ధి చేయాల్సిన బాధ్యత పాలకవర్గ సభ్యులదేనని తెలిపారు. నూతన పాలకవర్గాన్ని నియమించడంలో సహకారమందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్.శ్రీనివాసులు, నాయకులు సీహెచ్.శేషగిరి, ఎం.మల్లికార్జున, కె.వెంకయ్య, సొసైటీ సీఈఓ పరమేశ్వరరావు పాల్గొన్నారు.